క్లుప్తంగా

బీఎల్ కండ్రిగలో అడవికి నిప్పు


కాలిపోతున్న అడవి

బంగారుపాళెం: మండలంలోని బీఎల్ కండ్రిగ అడవికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోతోంది. గత రెండు రోజులుగా అడవి కాలిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు తెలిపారు. అడవికి నిప్పు పెట్టడం కారణంగా వివిధ రకాల వృక్షాలు కాలిపోవడమే కాకుండా అల్ప ప్రాణులు సైతం చనిపోతున్నాయన్నారు. అడవిలో మంటలు ఆర్పేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మొగిలి శివాలయంలో నేడు రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మునిరాజు తెలిపారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామి కామాక్షమ్మ మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు రాహుకేతు పూజల్లో పాల్గొని దోష నివారణ చేసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో సీఆర్‌పీ మృతి


సుధాకర్‌శెట్టి(ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని తిమ్మోజుపల్లెకు చెందిన సీఆర్‌పీ సుధాకర్‌శెట్టి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండల విద్యాశాఖలో సుధాకర్ శెట్టి కాంట్రాక్టు పద్ధతిలో పిడివి కండ్రిగ క్లస్టర్ రిసోర్సు పర్సన్‌గా(సీఆర్‌పీ)విధులు నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో చికిత్స కోసం తరలిస్తుండగా మృతి చెందారు. సీఆర్‌పీ మృతిపై ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్ బాబు, ఉపాధ్యాయులు, సహచర పీఆర్‌పీలు, స్థానిక సర్పంచ్ రేఖ, ఉపసర్పంచ్ భగత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాణి, ప్రకాష్‌రెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రచయితల సంఘం ఉగాది కవి సమ్మేళనం


ఉగాది కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న మన్నవ గంగాధర్ ప్రసాద్

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం యూత్ హాస్టల్లో ఉగాది కవి సమ్మేళనం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిధిలోని 40 మంది కవులు తమ స్వీయ కవితలను వినిపించి శ్రోతలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాహితీ వేత్త సాకం నాగరాజు, విశిష్ట అతిథిగా డాక్టర్ వి.కృష్ణవేణి, ఆచార్య గార్లపాటి దామోదరం నాయుడు, మన్నవ గంగాధర ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ ఉగాది ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. శతావధాని ఆముదాల మురళి కవితలపై సమీక్ష చేశారు. కవులు మాలేపట్టు పురుషోత్తమాచారి, సురేంద్ర రొద్ద, ఆకుల మల్లేశ్వరరావు, పేరూరు బాలసుబ్రమణ్యం, సుభద్ర, కడివేటి మునిరత్నం, మునస్వామి, వారణాసి వెంకటసుబ్రమణ్యం, షాజహాన్, సూర్య ప్రకాష్, యామిని, మన్నవ గంగాధర ప్రసాద్, కలువగుంట రామమూర్తి, మురళీధర్‌రాజు, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, యువశ్రీ మురళి, నడ్డినారాయణ, కొఠారి వెంకటరత్నం, శాంతకుమారి, గోపాల్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

క్రిష్ణజమ్మాపురంలో సత్యమ్మకు ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మాపురం, చెరువుముందరకండ్రిగలో వెలసిన సత్యమ్మకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గ్రామస్తులు అంబలి పోసి పాలు, చందనంతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం వివిధ కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు.


కూరగాయలతో అలంకరించిన సత్యమ్మ

చాపకింద నీరులా మధుమేహం

- విపరీతంగా పెరుగుతున్న దుష్ఫలితాలు
- 10 శాతం మందిలో దృష్టి లోపాలు
- వేధిస్తున్న కిడ్నీ సమస్యలు
- గుండెపోటుకు దారితీస్తున్న వైనం




మధుమేహ పరీక్ష చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్: మధుమేహం సైలెంట్ కిల్లర్. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా అమాంతం ప్రాణాన్ని హరించేస్తుంది. పైకి కనపడదు గానీ లోలోపల ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తుంది. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుంటూ, మందులు వాడుతూ అదుపులో ఉంచుకోకపోతే అనర్థాలు సృష్టిస్తుంది. అంతటి ప్రమాదకారి అయినా బాధితులు తేలిగ్గా తీసుకుంటున్నారు. దీంతో విపరీతంగా దుష్ఫలితాలు వస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కంటి దగ్గర నుంచి కిడ్నీల వరకూ దీని ప్రభావానికి గురవుతున్నట్లు వివరిస్తున్నారు.

నిర్లక్ష్యంతో దుష్ఫలితాలు

పాటించే నియమాలు, తీసుకునే ఆహారం, సక్రమమైన మందుల వాడకంతోనే మధుమేహాన్ని అదుపులో ఉంచుకోగలం. కానీ మధుమేహుల్లో 75 శాతం మందిలో నియమాలు పాటించకపోవడం, మందులు సక్రమంగా వాడకపోవడంతో దుష్ఫలితాలు పెరుగుతున్నాయి. కంటి రెటీనా దెబ్బతినడం, కిడ్నీలు ఫెయిల్యూర్, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, ఇతర మధుమేహ దుష్ఫలితాలతో రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. గుండె జబ్బు రోగుల్లో 40 శాతం, కిడ్నీ రోగుల్లో 60 శాతం మధుమేహ బాధితులే ఉంటున్నారు. కంటి రెటీనా దెబ్బతిని చూపు తగ్గినవారు సైతం పది నుంచి 20 మంది కంటి ఓపీకి వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

కంటి సమస్యలు

మధుమేహంతో కంటి రెటీనా సమస్యలు పెరుగుతున్నాయి. ఇటీవల నేత్ర వైద్యుల వద్దకు రెటీనా సమస్యతో వచ్చే వారి సంఖ్య పెరుగుతున్నట్లు వైద్యులు అంటున్నారు. మధుమేహుల్లో కంటి నరం (రెటీనా) చచ్చుబడి పోవడంతో పూర్తిగా దృష్టి కోల్పోవడం జరుగుతుంది. నగరంలోని నేత్ర వైద్యులు నెలకు 100 నుంచి 150 మంది వరకూ రెటీనా సమస్యలతో బాధపడుతున్న వారికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. శాశ్వత అంధులుగా మారకముందే గుర్తించడం ఎంతో మేలు.

క్షయ ముప్పు

ఒకప్పుడు హెచ్ఐవీ బాధితులకు క్షయ వ్యాధి ఎక్కువగా సోకేది. కానీ ప్రస్తుతం మధుమేహుల్లో క్షయ ముప్పు ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ కేంద్రంలో పది మందికి క్షయ వ్యాధి ఉన్నట్లు నిర్ధారిస్తే, వారిలో ముగ్గురు, నలుగురు మధుమేహ బాధితులు ఉంటున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. మధుమేహుల్లో సైతం వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండడంతో క్షయ వ్యాధి సోకుతున్నట్లు వైద్యులు స్పష్టం చేస్తున్నారు. రానున్న రోజుల్లో మధుమేహుల్లో క్షయ వ్యాధి పెనుముప్పుగా మారనుందనేది నిపుణుల అంచనా.

కిడ్నీలు ఫెయిల్యూర్స్

మధుమేహుల్లో కిడ్నీ సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. శరీరంలో షుగర్ స్థాయిలు అదుపులో లేని వారిలో వ్యాధి సోకిన ఐదేళ్ల నుంచి పదేళ్లలోపు కిడ్నీ సమస్యలు వస్తున్నాయి. ఒక్కసారి కిడ్నీలు పాడైతే, తిరిగి యథాస్థితికి వచ్చే అవకాశం ఉండదు. రోజుకు 150 నుంచి 200 మందికిపైగా నగరంలోని ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకుంటున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వారిలో 70 శాతం మంది మధుమేహులే ఉంటున్నారు.

సైలెంట్ హార్ట్ అటాక్

మధుమేహుల్లో రక్తనాళాలు బిరుసుగా మారడంతో గుండెపోటు వచ్చిన విషయం తెలియని పరిస్థితి నెలకొంటుంది. దీంతో ఒక్కో సమయంలో ప్రాణాలు కోల్పోతున్నారు. నగరంలోని కార్డియాలజిస్టుల వద్దకు వస్తున్న వారిలో 40 శాతం మంది మధుమేహులే ఉంటున్నారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన వారికి ఎకో చేస్తుంటే అప్పటికే గుండెపోటు వచ్చినట్లు పలువురికి నిర్ధారిస్తున్నారు. ఇలా మధుమేహుల్లో గుండె సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

జిల్లాలో కేసుల వ్యాప్తి

రోజురోజుకూ మధుమేహులు పెరిగిపోవడంతో పాటు, దాని కారణంగా వచ్చే ఇబ్బందులు సైతం పెరిగిపోతున్నాయి. ఒకప్పుడు 60 ఏళ్ల తర్వాత మధుమేహ ప్రభావాలు ఉండేవి. కానీ నేడు 40 ఏళ్లకే కిడ్నీలు పాడవడం, పాదాలకు రక్తప్రసరణ తగ్గడం, సైలెంట్ హార్ట్ అటాక్ వంటి వాటికి దారితీస్తున్నాయి. మధుమేహం ఉన్న వారిలో 50 శాతం మందికి తమకు వ్యాధి ఉన్నట్లు గుర్తించడం లేదు. ఏదో ఒక అనారోగ్య సమస్యతో ఆస్పత్రికి వెళితే కానీ బయట పడటం లేదు. ఉన్నట్లు గుర్తించిన వారిలో కూడా 50 శాతం మందే మందులు సక్రమంగా వాడుతూ షుగర్ స్థాయిలు అదుపులో ఉంచుకోగలుగుతున్నారు.

అదుపులో ఉంచుకోవాలి



మధుమేహం అదుపులో లేకపోవడం కారణంగా వచ్చే దుష్ఫలితాలతో చికిత్సకోసం రోగులు వస్తున్నారు. న్యూరాలజీ ఓపీకి వచ్చే వారిలో 20 శాతం మంది వారే ఉంటున్నారు. వారిలో బ్రెయిన్ స్ట్రోక్, న్యూరోపతి సమస్యలతోపాటు, మూమెంట్ డిజార్డర్ (షుగర్ లెవల్స్ 300 నుంచి 500 మధ్య ఉన్నప్పుడు కాళ్లు చేతులు కొట్టుకుంటూ ఉండడం), కోమాలోకి వెళ్లిన వారు వస్తున్నారు. మధుమేహ దుష్ఫలితాలతో వచ్చిన వారిని ఐసీయూలో అడ్మిట్ చేసి, ఇన్సులిన్ ఇంజక్షన్స్ ఇచ్చి సుగర్ లెవల్స్‌ను కంట్రోల్ చేస్తున్నాం. మధుమేహ బాధితులు చెడు ప్రభావం చూపిన తర్వాత చికిత్స పొందడం కంటే, ముందుగానే అదుపు చేసుకోవడం మంచిది.

–రాజశేఖర్‌రెడ్డి, డీసీహెచ్ఎస్, చిత్తూరు





మండుతున్న ఎండలతో జాగ్రత్త


డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: వేసవి దృష్ట్యా మండలంలో రోజు రోజుకూ ఎండలు మండుతున్నాయి. ఈ ఎండల తీవ్రత వల్ల ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రత, వేడి గాలులు కారణంగా వడదెబ్బ(సన్‌స్ట్రోక్) డీహైడ్రేషన్ వచ్చే అవకాశం ఉందన్నారు. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకంగా మారుతుందన్నారు. వడదెబ్బ వల్ల మరణాలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వడదెబ్బకు సాధారణంగా 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, గర్భిణులు, బాలింతలు(పాలిచ్చే తల్లులు), పసి పిల్లలు, గుండె జబ్బు, అధిక రక్తపోటు కలిగిన వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వడదెబ్బకు గురైన వారు వెంటనే డాక్టర్‌ను సంప్రదించి ప్రథమ చికిత్స చేసుకోవాలని సూచించారు.

భగవద్గీత పఠనం పిల్లలకు నేర్పాలి


భగవద్గీతపై ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

పలమనేరు: భగవద్గీతను పఠించడం పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని స్థానిక త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవాసమితి నిర్వాహకులు భాస్కర్ కోరారు. ఉగాదిని పురస్కరించుకుని మున్సిపాలిటీలోని నీళ్లకుంటలో ఆదివారం భగవద్గీతపై వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బాలాజి, వాణిశ్రీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీలక్ష్మీనారాయణుడి కల్యాణం


జెడి సుదర్శన్ కుమార్, శారద దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

గంగాధర నెల్లూరు: వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్ల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొల్పి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామి ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, పూలతో అలంకరించి వేద పండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి చిత్తూరు జిల్లా రిటైర్డ్ వెటర్నరీ జేడీ సుదర్శన్ కుమార్, శారద దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయ నిర్వాహకులు సంప్రదాయం ప్రకారం స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన భాగవతారిణి రాజేశ్వరి హరికథా కాలక్షేపం చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, అర్చకులు విష్ణు స్వామి. గోవిందస్వామి ద్వివేది పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి


ఘనజీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఫరీదు మస్తాన్, రిసోర్స్‌పర్సన్ పుష్ప

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ఐకేపీ ఏపీఎం ఫరీదుమస్తాన్, నగరి డివిజన్ ప్రాజెక్టు రిసోర్స్‌పర్సన్ పుష్ప తెలిపారు. ఆదివారం క్రిష్ణజమ్మాపురం యూనిట్‌లోని గ్రామ సంఘం అధ్యక్షురాలు, కోశాధికారి మునియమ్మ, కవిత, లత ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్ ప్రతాప్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన చెరుకు నుంచి తయారు చేసిన బెల్లంను టీటీడీ తీసుకుంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో విత్తనం నుంచి విత్తడం వరకు ద్రవఘన జీవామృతం, కషాయాలతో పండించే వారిపై అవగాహన కల్పించారు. వరిపంటను ఆశించే చిన్నచిన్న తెగుళ్ల నివారణకు పేడ, ఇంగువతో చేసిన ద్రావణం వినియోగించాలని సూచించారు. ఘనజీవామృతం తయారీ, మిత్ర, శత్రు పురుగులపై రైతులకు అవగాహన కల్పించారు.

జగనన్న దునియా చూపిత్తపా..!



నే బుల్లెట్టు బండెక్కి వచ్చేత్తపా
డుగు డుగు..డుగు డుగు అని
జగనన్న దునియా చూపిత్తపా
సిద్ధం సిద్ధం సిద్ధం..సిద్ధమని..!
రాష్ట్రాభివృద్ధిని చూడండిరో
మమ్మును ఆశీర్వదించండిరో..!

అనే లెవెల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుల్లెట్టు బండిని స్టార్ట్ చేసేసరికి ఆ బండి కూడా నేను కూడా 'సిద్ధం' అన్నట్టు జోరుగా సౌండిచ్చింది! ఆదివారం మంత్రి 'మేమంతా సిద్ధం' పేరిట మండలంలోని పలు గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఎంపీ ఎన్.రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు ఎండను సైతం లెక్క చేయకుండా హుషారుగా పాల్గొని వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. దుర్గ సముద్రంలో మంత్రి ఇలా బుల్లెట్ బైక్‌ను స్టార్ట్ చేసి ప్రచారానికి శ్రీకారం చుట్టేసరికి పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంతో పల్లెల వైపు దూసుకుపోయాయి. - చౌడేపల్లె

వలంటీర్ కావాలంటే.. మళ్లీ జగనన్న రావాలి

- కుతంత్రాల టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి
- గంగనపల్లెలో ఘనస్వాగతం


దుర్గానగర్‌కాలనీలో ప్రచారం చేస్తున్న విజయానందరెడ్డి




గంగనపల్లెలో ప్రచారం చేస్తున్న విజయానందరెడ్డి, గంగనపల్లెలో గజమాలతో విజయానందరెడ్డికి స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

చిత్తూరు కార్పొరేషన్: వలంటీర్ మళ్లీ ఇంటికి రావాలంటే జగనన్న సీఎం కావాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. స్థానిక గంగనపల్లె, దుర్గానగర్‌కాలనీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గంగనపల్లెలో ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. వలంటీర్ మళ్లీ ఇంటికి రావాలంటే జగనన్న సీఎం కావాలని స్పష్టం చేశారు. కుట్రలు, కుతంత్రాలు చేసే రాజకీయాల్లో ఆరితేరిన టీడీపీ అధినేత చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు అవుతాయన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను ఏనాడూ నెరవేర్చిన దాఖలాలు లేవన్న విషయం అందరూ గుర్తుంచుకోవాలని చెప్పారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఈ రాష్ట్రంలో కనిపించే చంద్రబాబు మాయమాటలతో మోసం చేయడానికి వచ్చారని పేర్కొన్నారు. టీడీపీకి ఓటేస్తే అవినీతి, అక్రమాలకు చోటిచ్చినట్లేనని, సంక్షేమ పథకాలన్నీ రద్దు చేసుకున్నట్లేనని తెలియజేశారు. మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయని, ప్రజలకు పీక్కుతింటాయని గుర్తు చేశారు. కులం, మతం, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. అందరూ కలిసికట్టుగా ఫ్యాను గుర్తుపై ఓటేయాలని కోరారు.

పింఛనకు అడ్డుపడిన చంద్రబాబు

ప్రజాక్షేత్రంలో ప్రజలకు మంచి చేయాల్సిన చంద్రబాబు పింఛన్‌దారుల ఉసురు పోసుకున్నారంటూ విజయానందరెడ్డి మండిపడ్డారు. ఐదేళ్లుగా వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి పింఛను ఇస్తున్నారని, ఇప్పుడు వారికి సకాలంలో పింఛన్ దక్కకుండా చంద్రబాబు అడ్డుపడ్డారని విమర్శించారు. పింఛన్ తీసుకునేందుకు వెళ్లిన అధిక సంఖ్యలో వృద్ధులు మరణించారన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేశారని చెప్పారు. కోట్లాది రూపాయలు వాటి కోసం ఖర్చు పెట్టారని గుర్తుచేశారు. సంక్షేమ పథకాల ద్వారా వేలాది కుటుంబాలు లబ్ధి పొందాయని వివరించారు. మరింత మంచి జరగాలంటే జగనన్న ప్రభుత్వం తిరిగి అధికారంలో రావాలని పిలుపునిచ్చారు. చిత్తూరు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. పరిశ్రమలను తెచ్చి యువతకు ఉపాధి మార్గాలు చూపుతానన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు చూపే కపటప్రేమను ఎవరు నమ్మవద్దని చెప్పారు. జగనన్న ప్రభుత్వం మళ్లీ అధికారంలో వచ్చాక మరింత మందికి సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, 5వ డివిజన్ కార్పొరేటర్ హరిణిరెడ్డి, నాయకులు గుర్రప్పనాయుడు, శ్రీరాములు, ప్రసన్న, వినోద్, హరి, కోకిల, శివ, గోపి, వినయ్, ప్రకాష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యం సుసంపన్నం

తిరుపతి కల్చరల్: భారతీయ భాషల్లో తెలుగు సాహిత్యం సుసంపన్నమైందని, మన పూర్వీకులు అందించిన ఈ సాహిత్య సంపదను భావితరాలకు అందించాలని ప్రముఖ సాహిత్యకారుడు ఆచార్య కిరణ్ క్రాంత్ చౌదరి తెలిపారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉగాది కథల పోటీల బహుమతి ప్రదాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రధాన వక్త, సాహితీ విమర్శకుడు ఆచార్య మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ ప్రథమ బహుమతి గూటికి చేరిన పక్షులు కథ రాసిన లక్ష్మీ గాయత్రి, ద్వితీయ బహుమతి డాక్టర్ ఎం.సుగుణరావు, తృతీయ బహుమతిగా నీలకంఠంకు 5, 4, 3 వేల రూపాయలు చొప్పున బహుమతులు ప్రదానం చేశారు. అలాగే పది మంది కవుల కథలకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి, టెంకాలయ దామోదరం, సాకం నాగరాజు, తమటం రామచంద్రారెడ్డి, డాక్టర్ ఆర్‌వీ సురేష్‌కుమార్, షేక్ నసీమ్, డాక్టర్ కృష్ణవేణి, శతావధాని ఆముదాల మురళి, డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, సుభద్ర, పేరూరు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.


ఉగాది కథల పోటీల విజేతలను బహుమతులతో సత్కరిస్తున్న అతిథులు